


కొండ్రలావు ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణకు నడుం బిగించేడు.

అంతకు ముందే ఆయన ప్రజల్ని మేల్కొల్పాలనే ఆశయంతో పనిచేయటం ప్రారంభించేడు. అందుకు గాను జనంలో ఉన్న అజ్ఞానాన్ని, మూఢ నమ్మకాల్ని తొలగించడానికి "దేవుడు లేడు. దెయ్యం లేదు" అని మీటింగులు పెట్టించేడు అందుకుగానూ ఓ సుబ్రావు గార్ని తయారుచేసేడు.

సుబ్రావుగారు గతంలో ఆస్తికుడూ, భక్తుడునూ. వారు సంస్కృత భాషను అభ్యసించేరు. ఆయన తనింట్లో క్రొవ్వొత్తుల వెలుగులో రామాయణాన్ని పారాయణం చేస్తుండగా, మూడు టెక్నికల్ మిస్టేకులు దొరికాయంటూ తీసుకొచ్చి "వాల్మీకి ఇలా పొరబడ్డాడేమిటబ్బా" అని ఆశ్చర్యపోబోతే, కొండ్రలావేదో చెప్పబోయాట్ట." ఈ ప్రక్షిప్తకారులున్నారు మావాడు.. అంటూ తిరిగి ఏదో చెప్పబోతే కొండ్రలావు అడ్డుపడి

"రామాయణం ఫ్యూడల్ గ్రంథం.. దాంట్లో రెండు మూడు చిన్న తప్పులు కాదు. ఇంకా మీరు వెదకాల్సింది చాలా ఉంది" అన్నాడు.

దాంతో సుబ్రావుగార్కి జ్ఞానోదయం కలిగి ఇంకా పెద్ద క్రొవ్వొత్తి నీడలో కూర్చుని శ్రద్ధగా చదివేరు. క్రొవ్వొత్తి క్రమంగా కరిగిపోయింది— తనలోని వెలుగునూ, శక్తినీ, త్యాగాన్నీ సుబ్రావులోకి ఇంజక్ట్ చేసి.

అప్పటినుండే సుబ్రావుగారు నాస్తిక ఉద్యమానికి ఎస్టాబ్లిష్ అయిపోయేరు. ఆయన పరిశీలనతో రామాయణ, భారత భాగవతాల్లో అంతా "బూతు" కనపడింది. అందుచేత బూతుకు వ్యతిరేకంగా సుబ్రావుగారు కదిలేరు. ఆంధ్ర దేశమంతా ఆయనకు నీరాజనాలు పట్టింది. ఊరూరా ఆయన పురాణాల్లో సెక్సు గురించి చెప్పుకుపోతుంటే కుర్రాళ్ళు లొట్టలేసుకుంటూ విన్నారు.

అప్పుడు కొండ్రలావుకు అనుమానం వచ్చి "సుబ్రావుగారూ.. పురాణాల్లో బూతు గురించే గాక ఇంకేమైనా చెప్పకూడదా" అనడిగేడు.

"చూడండి కొండ్రలావుగారూ.. తెలుగు మాస్టారు సైన్సు చెప్పగలరా? పురాణాల్లో బూతు గురించి పరిశీలించాను. ఇంకా పరిశీలించాలి. అది నా సబ్జక్ట్. మిగతా కార్యక్రమం మీరు తీసుకోండి. నా పరిధి అదే అని చెప్పేడాయన.

దాంతో కొండ్రలావుకి జ్ఞానోదయం కలిగి.. నాస్తిక ఉద్యమం నుండి బయట కొచ్చేసి, ప్రజాతంత్ర హక్కులే కాపాడటానికి నిర్ణయించుకున్నాడు.

* * *

"ఏం బాబూ ప్రజాతంత్ర హక్కులు దేశం కోసమేనా.. మా అమ్మాయికి మా మనవడు, మనవరాలికి లేవా?" అనడిగేరు కొండ్రలావు మావగారు.

"అదేమిటి? అవి వారి జన్మహక్కులు".

"సంతోషం. మరి కట్టుకున్నందుకు గానూ అమ్మాయికి తిండి పెట్టడం.. కన్నందుకు గానూ వాళ్ళకి చదువులు చెప్పించటం నీ ప్రజాతంత్ర బాధ్యత కాదా" అని నిలదీసేడాయన.

"ఇంతకూ ఏమంటారు" కొండ్రలావు సూటిగా అడిగేడు. వండి వార్చటానికి, వారి కడుపులు నిండటానికి, చదువు కొనటానికి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వారి హక్కులు కాపాడండి" అంటూ శెలవిచ్చారు.

కొండ్రలావుకి తిరిగి జ్ఞానోదయం కలిగింది.

* * *

ఓ సభలో సుబ్రావుగార్ని ఆయన మిత్రుడడిగేడు "అవునూ.. మన నాస్తిక మిత్రుడు కొండ్రలావుగారేం చేస్తున్నారు... కనపడటం లేదు."

"జనాన్ని మేల్కొలిపే కార్యక్రమంలోనే ఉన్నారు." అన్నారు సుబ్రావుగారు నవ్వి.

"అంటే"

"కోళ్ళఫారం పెట్టేరు".